# ఒడుదుడుకులు

నా ఉద్యోగం బదిలీ అయి, నే నా ఊర్లో కాపురం పెట్టి అప్పటికి దగ్గర దగ్గర వొక సంవత్సరం అవుతుంది. రజాక్ అంగడి ఆ వూళ్లో మా యింటికి ఎదురుగా వుండేది. అది పెద్ద అంగడీకాదు; దానికి పెద్ద అమ్మకమూ లేదు. మామూలుగా కొట్టం అంటారే అదీ అది. అంటే రాళ్ళు పేర్చి రెండు ప్రక్కలా రెండు గోడలు అమర్చాడు. వెనక తడిక కట్టాడు! పైన తడికె కట్టాడు. అదీ అతని అంగడి. ముందు వొక నిప్పుల కుంపటీ, దాని ప్రక్కన వొక చిన్న ఎత్తుపాటి బల్లా అదీ అతని సామగ్రి. రిక్షావాళ్ళూ, జట్కావాళ్లు వొచ్చి టీ త్రాగి పోతుండేవాళ్ళు. వాళ్లు నిలబడే త్రాగిపోతుండేవాళ్ళు.

ఆ అంగడిమీద రజాకుకి చెప్పుకోదగ్గ రాబడి యేమీ లేదు. కాని అతనికి ఎంత వస్తే అంతే చాలు. అతనికి ఇద్దరు కొడుకులుంటే, వాళ్ళిద్దరూ రెక్కలువచ్చి, గుర్రపు బళ్ళు తోలుకొని ఎవ్వరిపొట్ట వాళ్ళు పోసుకుంటున్నారు. ఎవరి కాపరాలు వాళ్లు చేసుకుంటున్నారు. మిగిలిందల్లా 'కైరూన్' అనే

కూతురు. దానికి పది పన్నెండు యేళ్లుంటాయి. వాళ్ళిద్దరికీ రెండుపూటలా అన్నం తినాలనే నియమం లేదు. వుంటే తినేవారు; లేకపోతే లేదు. ఒక్కొక్కరోజు ఆ వచ్చే నలుగురూ రాక టీ కని కొన్నపాలు యే గ్లాసో, అరగ్లాసో మిగిలితే చెరి కాసినీ తాగి పడుకునేవారు. రజాక్ కొడుకులకు, ఏమన్నా ఇయ్యగలిగితే, గుర్రానికి గడ్డికనీ, గాదానికనీ ఇచ్చేవాడుగానీ ఎంత అవుసరమైనా తాను పస్తువుండి కూతుర్నికూడా ఉంచేవాడుగాని, వాళ్లని దమ్మిడీ అడిగేవాడుకాదు. ఒక వేళ వాళ్లు ఇవ్వవచ్చినా పుచ్చుకునేవాడు కాదు. పైగా వాళ్ళమీద, "ఏం! నా కిచ్చేవాళ్ళయ్యారా, మీరు!" అని ఎగిరిపడేవాడు. అతనికి రోజులు అలాగే గడిచిపోతున్నయ్.

* * *

ఉండి వుండి వొకనాడు రజాక్ కొట్లో సందడి ఎక్కువైంది. నేనప్పుడు మొహం కడుక్కుంటున్నాను. తలెత్తి చూద్దును గదా, రజాక్ వొక ఎర్రని సిల్కు చొక్కా తొడుక్కొని, కళ్ళకు సుర్మాపెట్టి, పెళ్ళికొడుకల్లే దిద్దుకొని, కొట్టు మీద కూర్చొనివున్నాడు. దారే పోయేవాళ్ళని పిలవటం, పరియాచికా లాడటం - మహా సంతోషంలో వున్నట్లు కనిపించాడు. ప్రక్కన పంపుదగ్గర నీళ్ల కోసం పోట్లాడుకునేవాళ్ళని "ఎందుకుబే, అట్లా పోట్లాడుకుంటారు, జరా పానీకోసం!" అన్నాడు. అన్నిటికంటే నాకు ఆశ్చర్యాన్నిచ్చింది, అతనికి ఎదురుగా పెద్ద బుట్టలో అమ్మకం కోసం పోసివున్న గారెలు. నేను ఆ ఊరువచ్చినప్పటినుంచీ రజాక్‌ని చూస్తూనేవున్నాను. అతనే నాడూ "టీ" తప్ప మరేదీ అమ్మినట్లు నా స్ఫురణలో

లేదు. ఆ టీ కూడా ఎవరన్నా ఒస్తే. "ఎందుకు వచ్చారా?" అన్నట్లు అతి బద్ధకంగా అమ్ముతుండేవాడు. అటువంటి రజాక్ యొక్క ఈ అట్టహాసంచూచి, అతనికి ఏదో అదృష్టంవచ్చింది అనుకున్నాను నేను. అదృష్టాని కేముంది? మన పెద్దలు చెప్పి నట్లు, వస్తే కొబ్బరికాయులో నీళ్లకు మల్లేనూ పోతే కరిమింగిన వెలగపండులోని గుజ్జుకుమల్లే ప్రవర్తిస్తుందావెం! ఇటువంటి మాయలాడి, రజాక్‌ని పట్టుకుంటే పట్టుకుని వుండవచ్చు అను కున్నాను. ఇది ఆమె లీలల్లో ఒక లీలై వుండవచ్చు.

ఈ విషయమే నేను నా భార్యతో చెప్పాను. చెపుతూ వుండగా రజాక్ కూతురు మా యింటికి నీళ్లకు వచ్చింది. అదీ మారింది. శుభ్రంగా స్నానంచేసినట్లువుంది. తల చక్కగా దువ్వి, పై రెండుజడలు వేసింది. రెండు జడలకూ రెండు ఎర్రని సిల్కురిబ్బన్లు కట్టింది. క్రొత్తజాకెట్టుతొడిగింది! లంగా కట్టింది. మొహంనిండా నవ్వే. నా భార్య దాన్ని ఎగా దిగా చూచింది. అడిగింది—

"ఏమే?"

"ఏం అమ్మా?" - సిగ్గుపడుతూ అన్నది ఖైరూన్ - రజాక్ కూతురు,

"నీ అబ్బ ఇవ్వాళ సిల్కుచొక్కా వేశాడటే!" అని అడిగింది నా భార్య నవ్వుతూ.

"అవునమ్మా" తన క్రొత్తబట్టలు జ్ఞాపకంవచ్చి తల పైకెత్తకుండానే జవాబులు చెప్పింది రజాక్ కూతురు.

"ఇవ్వాళ అంగడిమీద గారెలుకూడా పెట్టారటగదే"

"అవును అమ్మగారూ, రేపు బజ్జీలు పెడతాం. ఎల్లుండి పకోడీలు పెడతాం. ఇకనుంచి రోజుకొక పదార్థం పెట్టాలనుకున్నాం అమ్మగారూ" - గట్లు తెగిన ప్రవాహానికి మల్లే పొర్లుకుపోతోంది రజాక్ కూతురు వాక్కు.

"నీ అబ్బ చేస్తాడా, నువు చేస్తావే? ఈ గారెలూ. బజ్జీలూ, పకోడీలూ, ఆ చెయ్యబోయే అన్నీనూ?" అని అడిగింది నా భార్య.

"మాకేం చేతనవు అమ్మగారూ? ఆమెకు ఎన్నో పిండి వంటలు చేతనవు. రోజుకొకటి చొప్పున చేసినా తరగవట. ఆమె చేసి యిస్తూవుంటే మేం కొట్టుమీదపెట్టి అమ్ముతూ ఉంటాం" అన్నది.

"ఆమె ఎవ్వరే?" అని అడిగింది నాభార్య ఆశ్చర్యంగా,

"మా అబ్బ తోలుకొచ్చెనె, ఆమె" అన్నది రజాక్ కూతురు.

ఈ మాటకు మేము ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం. అనేక ప్రశ్నలు వేసి చివరికి రజాకు వొక క్రొత్త మనిషిని తీసుకువచ్చాడనీ, ఆమె వొచ్చి కాపురం పెట్టిందనీ, ఆమె వొత్తిడితో పిండి వంటల అమ్మకంకూడా పెట్టారనీ, ఆమె ఇంటిని ఒకదారికి తీసుకురావటమే కాక రజాకునీ అతని కూతుర్నీ బాగా చూస్తుందనీ తేలింది. "బలే మనిషి అమ్మగారూ!" అన్నది రజాక్ కూతురు.

"ఇదంతా విని - "నీ అన్నలకు తెలుసటే ఈసంగతి" అని అడిగింది నా భార్య.

"తెలియకేం అమ్మగారూ!" అన్నది రజాక్ కూతురు.

"వాళ్ళేమన్నారే?"

"ఏమంటానికి ఏముంది అమ్మగారు! వాళ్ళు వాళ్ళ పెళ్ళాలతో కాపరం ఉండటంలా!" అన్నది రజాక్ కూతురు అని నీళ్లుముంచుకోటానికి దొడ్లోవున్న తొట్టిదగ్గరకు వెళ్లింది.

"చూశారా దాని మాటలు!" అన్నది నా భార్య నవ్వుతూ.

నా భార్యకు ఖైరూన్ అంటే ఇష్టం. ఏ మాటఅడిగినా అది నవ్వుతూ జవాబు చెప్పేది ఏ పని చెప్పినా నవ్వుతూ చేసేది. మిన్నువిరిగి మీదపడినా లోణికేదికాదు. అందుకని అదంటే నా భార్యకు యిష్టం. నేను మాత్రం ఖైరూన్ సంగతి ఆలోచించడంలేదు. "ఈ వయస్సులో వుండి రజాక్ పెళ్ళి చేసుకోవటం ఏమిటి? ఈ మానవుడు చిత్రుడు" అనుకుంటు న్నాను.

* * *

కొన్నిరోజులు గడిచినై. ఆఫీసు గొడవల్లోపడి నే నీ విషయమే మరచిపోయాను. ఉదయం పదిగంటలకల్లా అవు సరమైన పనులన్నీ తొందర తొందరగా పూర్తిచేసుకొని, గబగబా, పొగలు వెళ్లగ్రక్కుతున్నఅన్నం నాలుగు ముద్దలు

మ్రింగి ఆఫీసుకు వెళ్ళటం-మళ్ళీ రాత్రి యే ఏడుగంటలకో, ఎనిమిదిగంటలకో ఆఫీసునుంచి వ్రేళ్ళాడబడి తిరిగి రావటం, ఏ పని చెయ్యటానికి బుద్ధిపోక కాళ్ళారజాపుకొని మడత కుర్చీలో జేరగిల బడటం— ఈ ప్రకారం దొర్లిపోతున్నాయి రోజులు. ఇటువంటి జీవితంలో యితరులను గురించీ, వాళ్ల జీవితాల ఒడుదుడుకుల్ని గురించీ ఆలోచనకు తావెక్కడ? కాకపోతే అప్పుడప్పుడు నా భార్య చెప్పే మాటలనుబట్టి, రజాక్ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వృద్ధి చెందుతూ వుందనీ ఆ క్రొత్త మనిషి అడుగు పెట్టింతర్వాత, రజాక్ కి బాగా కలిసి వొస్తూవుందనీ, రజాక్ నీ, ఖైరూన్ని ఆ క్రొత్తమనిషి బాగా చూస్తూవుందనీ,అందువల్ల శారీరకంగా వాళ్ళిద్దరూ బాగుపడ్డారనీ తెలుసుకున్నాను. నేనుకూడావచ్చే పోయేటప్పుడు రజాక్ కొట్లో జరుగుతున్న మార్పులను గమనిస్తూనే వున్నాను. మొదటిలో రోజుకొకటిచొప్పున తిను బండారాలు తయారుచేసేవారు. కొద్దిరోజులకు, ప్రతిరోజూ అన్ని పదార్థాలను చెయ్యటం మొదలుపెట్టారు. మరికొన్ని రోజులకు కొట్టుముందు అరటిగెలను వ్రేలాడగట్టారు. చివరికి మాసపత్రికలూ, వారపత్రికలనూ కూడా వ్రేలాడ గట్టటం మొదలుపెట్టారు. ఇవన్నీ చూస్తూ నేను సంతోషించాను. "ఒక దృష్టితో చూస్తే, అదే మంచిజీవితం!" అనిపిస్తూవుండేది నాకు. కాని కాలం ఒకరకంగా నడవదు అనే సత్యం అందరికీ తెలిసిందే! అది వున్నట్లువుండి పెడతిరుగుతుంది.

ఆనాడు. ఆదివారం అవటంవల్ల, రామాయణం తిరగ

వేస్తూ కూర్చున్నాను నేను. నాకు నిజంగా రామాయణం అంటే ఇష్టం. ముఖ్యంగా సుందరకాండ, అందులో సీతమ్మ వారికి హృదయ విదారకమైనస్థితీ, రావణుని భోగలాలసత్వం వేకువజామున లేచి సింగారించుకొని సీతమ్మ వారికోసం రావణుడు అశోకవనానికి వెళ్ళినరీతి, రాములవారిని నిందించినప్పుడు సీతమ్మవారు రోదించిన రోదనా-ఎన్నిసార్లుచదివినా నాకింకా చదవాలనే వుంటుంది. రావణుడు కామోద్రేకంతో తన దగ్గరకు వొచ్చినప్పుడు ఆ పతివ్రత తన నాభినీ, నడుంనీ, వక్షద్వయాన్నీ ఆ దుష్టునికంటపడకుండా తన అరటిస్తంభాల్లాంటి తొడలతో కప్పుకోటానికి చేసిన ప్రయత్నం-ఎన్నిసార్లు చదివినా హృదయాన్ని ద్రవింపజేస్తూనే వుంటుంది.

ఆనాడు నేను మళ్ళీ అదే ఘట్టం చదువుతూ కూర్చున్నాను. ఆ ఘట్టం చదువుతూ కూర్చున్న నాకు_రజాక్ వచ్చి ఎదురుగా నుంచున్న సంగతే తెలియలేదు.

అతడు "సాబ్" అన్నాడు. నేను తలెత్తి చూశాను. ఎదురుగా రజాక్. కళ్ళు తుడుచుకొని, "ఏం రజాక్!" అని అడిగాను. వెంటనే ప్రత్యుత్తరం రాకపోయేటప్పటికి తల పైకెత్తి చూశాను. నాకు ఆశ్చర్యం వేసింది రజాక్ నెత్తిన పిడుగుపడిన వానికిమల్లే వున్నాడు. వేటగాని విజృంభణకు బెదిరిపోయి బిత్తరచూపులు చూస్తున్న లేడికిమల్లే వున్నాడు.

"ఏమిటి రజాక్!" అని అడిగాను.

"యేమీలేదు సాబ్. చెప్పుకుందామని వచ్చాను" అన్నాడు రజాక్.

"ఏమిటి!"

"మీా దగ్గర దాపరికం యెందుకు సాబ్! నాతో ఒక మనిషి వుంటావుంది. అంటే ఆమెది నా కులంకాదు; నాది ఆమె కులంకాదు... కాని మాకు అట్లా కలిసిపోయింది సాబ్. ఆ మనిషికూడా వున్నన్నాళ్లూ బాగానేవుంది. కైరూన్‌ను అడగండి. ఉన్నన్నాళ్ళూ దాన్ని కన్నబిడ్డకన్నా యెక్కువగా చూసింది. సాబ్.

"అనే నేనూ విన్నాను. ఇప్పుడేమయింది?" అని అడిగాను.

"పదిరోజుల క్రిందట యింటికి వెళ్ళివస్తానని వెళ్లింది సాబ్. యింతవరకు పత్తాలేదు.... వెళ్ళేటప్పుడు వందరూపాయిలు తీసుకువెళ్ళింది. ఎవ్వరో కుదువపెట్టిన నాగరం, కడియాలూ కూడా తీసుకువెళ్లింది సాబ్" అన్నాడు.

నాకేమీా తోచక, "ఎందుకిచ్చావ్?" అని అడిగాను.

"మనస్సులు కలిసింతర్వాత నీదీ నాదీ యేమిటిసాబ్. కలిసిపోవటం అంటే అంతా వొకటే 'నాగరం, కడియాలూ పెట్టుకోవాలని వుంది' అన్నది సాబ్. 'సరే పెట్టుకో' అన్నాను. 'దూరం వెళ్తున్నాను. డబ్బు ఎందుకైనా కావలసి వస్తుంది' అన్నది సాబ్. 'సరే పెట్టెలో వున్నది తీసుకుపో' అన్నాను."

"నువ్వు తీసుకుపొమ్మంటే తీసుకుపోయింది. తప్పేముంది!" అని అడిగాను

"తప్పుకాదు సాబ్. తను నాలుగు రోజుల్లో వస్తానంటే గదా సాబ్ నేను, అవి అన్నీ యిచ్చింది." అని అడిగాడు రజాక్.

"వస్తుందేమో-అప్పుడే తొందరపడతావెందుకు!" అని అడిగాను.

రజాక్ కాసేపు ఆలోచించాడు అతని కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగినై "రామసాబ్ ... అక్కడేదో జరిగింది సాబ్ ..." అని అంతమనిపి. గోడుగోడున యేడ్వటం మొదలు పెట్టాడు "నేను బ్రతకన్ సాబ్!" అన్నాడు. వెక్కి వెక్కి యేడుస్తూ.

నేను నిలువలేకపోయాను. అతని దుఃఖం ముందు... ఎవ్వరి కష్టం అయినా కష్టమే. నిజంగా నావల్ల యేమన్నా అయితే అతనికి సహాయం చెయ్యా లనిపించింది 'ఏంచెయ్యమంటావ్ రజాక్!" అని అడిగాను.

"ఆమెను యిక్కడకు వచ్చేటట్టు చెయ్యండి సాబ్." అన్నాడు రజాక్.

"ఎట్లా!" అని అడిగాను.

"ఎవ్వరితో నైనా కబురు చెయ్యండి సాబ్." అన్నాడు రజాక్.

"సరే ఆమె ఊరి పేరు!" అని అడిగాను.

హైదరాబాద్ దగ్గర వొక ఊరిపేరు చెప్పాడు రజాక్ నేను ఆలోచించాను. ఆవిడ రజాక్‌ని పెళ్లి చేసుకోలేదు...

ఆవిడ డబ్బూ వస్తువులూ తీసుకుపోయినట్లు రజాక్ మాట తప్ప ఏ సాక్ష్యమూ లేదు. పోనీ యే పోలీసుసహాయంతోనో తంటాలు పడదామంటే పరరాష్ట్రంలో ఉనికి. ఈ సాధక బాధకాలన్నీ నెమ్మదిగా రజాక్ కి చెప్పాను.

"అదేమీ అక్కర్లేదు సాబ్. ఆమె అసలు ఆ వూళ్లో ఉందో లేదో, ఉంటే ఏం చేస్తావుందో. కనుక్కోండి... ఆ వూళ్లో వుంటే "రజాక్ నీ కోసం యెదురుచూస్తున్నాడు" అని కబురు అందజెయ్యండి సాబ్" అన్నాడు రజాక్.

"అది లాభంలేదు సాబ్. ఆమె ఊరు వొక అడవిలో వుంది. వాళ్ళ వాళ్ళంతా శానా మోటువాళ్ళు సాబ్. మే మిద్దరం కలిసి వుంటున్నామని మా మీద శానా కోపంగా వున్నది వాళ్ళకి. నేను వెళ్తే నన్ను తిరిగి రానివ్వరు సాబ్. లేకపోతే యిన్నాళ్ళూ వూరుకునేవాణ్ణా సాబ్," అన్నాడు. అతని కళ్ళల్లోకి మళ్లీ నీళ్ళు వచ్చినై. చేసే వీలు, నిజానికి నాకు కనపడకపోయినా, అతని కా సంగతి చెప్పలేక పోయాను."

"వాళ్ళ వాళ్లు అటువంటి వాళ్ళని తెలిసినప్పుడు నువ్వసలు పంపకుండా వుంటే బాగుండేది రజాక్." అన్నాను. అతను నా మీద పెట్టిన బాధ్యతను కాస్త పంచుకుందామని.

"నిజమే సాబ్. యిప్పుడదే అనుకుంటున్నాను. కాని ఆ మధ్య వాళ్ళచుట్టం వొకామె వొచ్చి నా యింట్లో పది రోజులు ఉండిపోయింది సాబ్. ఆమె ఇప్పుడక్కడ అంతా బాగానే ఉందనీ, మా మీద యిప్పుడెవ్వరికీ కోపం లేదనీ

చెప్పి వొక్కసారి ఆమెను రమ్మనమని చెప్పిందిసాబ్. అంతా చూడా లనుకుంటున్నారన్నది. నేను "నిజమే" అని నమ్మా. యిప్పుడు చూసుకుంటే అదంతాకూడా వొక ఎత్తుగడేమో అని అనిపిస్తావుంది సాబ్," అని కన్నీరు తుడుచుకున్నాడు రజాక్. నేను, "నాకు చేతనైన సహాయం చేస్తా"నని చెప్పి వోదార్చి పంపాను. కాసేపు యేం చేద్దామా అని ఆలోచించాను. హైదరబాద్‌లోవున్నవొక మిత్రుడు జ్ఞాపకంవచ్చాడు. ఈ విషయం కనుక్కొని నాకు పరిస్థితిని తెలుపవలసిందని అతనికి వెంటనే ఉత్తరం వ్రాశాను.

* * *

కొద్దిరోజుల్లోనే నా వుత్తరానికి నా మిత్రుని దగ్గర నుంచి జవాబు వచ్చింది. ఆ వుత్తరంలో నేను ఉదహరించిన ఊరు అడవి ప్రాంతాల్లో వుందనీ, అక్కడికి రాకపోకమార్గాలులేవనీ, అందువల్ల తన నౌకర్ని ఆ వూరుపంపి ఆచూకీ తీయించానని, నేను వుదహరించిన పేరుగలిగిన వ్యక్తి ఆ వూళ్లో వొకప్పు డుండేది గాని యిప్పుడు లేదనీఇది రూఢివార్తే ననీ వ్రాశాడు నా మిత్రుడు.

నాకు యెందుకనో ఈ మనిషి ఆ వూరుకి చెందిన మనిషి కాదనీ, రజాక్‌ని మోసంచేసి డబ్బూ నగలూ కాజేసిందనీ అనిపించింది. కాని ఈ విషయం రజాక్‌తో చెప్పటం ఎట్లా? నాలో నేను చెప్పుదామా, వొద్దా అని కొంచెంసేపు

ఆలోచించాను. అప్పటికప్పుడే అతను నాలుగైదుసార్లు ఉత్తరానికి జవాబు వొచ్చిందా అని అడిగి వెళ్లాడు. అతని ప్రాణాలన్నీ ఈ జవాబుమీదే వున్నాయి. అసలు ఆ మనిషి ఆ వూరుకే చేరలేదని చెపితే యెంత బాధ పడతాడో! ఏదైనా వున్నది వున్నట్లు రజాక్‌కు చెప్పటం వుత్తమంఅనుకొని అతనికి కబురు పెట్టాను. అతను రాములవారి బాణానికిమల్లే రంయిన వచ్చాడు. నేను నెమ్మదిగా నా మిత్రుడు వ్రాసిన సంగతులు తెలియచేశాను.

రజాక్ మొహం వివర్ణం అయింది. "వొట్టిది సాబ్. ఆమె ఆ వూళ్ళోనే వుంటుంది. ఊళ్లోవాళ్ళు తెలియనివ్వటం లేదు" అన్నాడు రజాక్.

"వాళ్ళెందుకు తెలియనివ్వకుండా వుంటారు రజాక్. తెలియనివ్వకపోతే వాళ్ళకేం వస్తుంది!" అని అడిగాను.

"వాళ్ళు పగపట్టారు సాబ్." అన్నాడు రజాక్.

"పోనీ వాళ్లు పగపడితే, ఆబిడకు నిజంగా నువ్వంటే యిష్టమైతే తానేఃయటపడొచ్చుగా!" అని అడిగాడు.

"వాళ్ళు పడనివ్వరు సాబ్." అన్నాడు రజాక్.

"కనుమరగించి రావొచ్చు" అన్నాను.

"వాళ్ళదగ్గర కుదరదు సాబ్" అన్నాడు. రజాక్.

ఇక నేను అతనికి యేం చెప్పగలను! "నువ్వేమీ దిగులుపడకు. మళ్లీ ప్రయత్నిద్దాం" అన్నాను

"ఇంకేం ప్రయత్నించి ఏం ప్రయోజనం సాబ్. ఈ పాటికి చంపేసే వుంటారు," అని ఆపుకుని ఆపుకుని ఏడ్చాడు రజాక్. గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు. అంతే.

ఆనాటినుంచీ అతని అంగడి క్షీణదశకురావటం ప్రారంభించింది. అప్పటిదాకా ఆబిడ యింకా వస్తుందనే నమ్మకంతో, హంగు చెడకుండా నడుపుతూ వచ్చాడు రజాక్. ఇక ఆమె లేదని తేల్చుకున్నాడు. అనుమానించ వలసింది. అనుమానించకుండా పంపటం తన తప్పే అనుకున్నాడు. ఇక అంగడి సంగతి ఆలోచించటం మానివేశాడు. మొదటిలో పిండి వంటలు తగ్గినై. తరువాత అరటికాయలు తగ్గినై ఆతరువాత పత్రికలు తగ్గినై. అంగడి యథాప్రకారానికి వొచ్చింది. రాక రాక ఎవ్వరయినా వచ్చి టీ అడిగితే ఈ లోకంలో లేనట్లు కూర్చునేవాడు రజాక్.

* * *

ఒకరోజు నా భార్య మాటా మాటా మీద, రజాక్ వ్యాపారం పూర్తిగా పడిపోయిందనీ, వాళ్ళకి గడవటమే కష్టంగా వుందనీ, అప్పుడప్పుడూ ఖైరూన్ దాని తండ్రికి తెలియకుండా సోలెడూ అర సోలెడూ బియ్యంతీసుకువెళ్తూ ఉందనీ చెప్పింది. నాకు మనస్సు కలుక్కుమంది.

"వ్యాపారం వృద్ధిచేసుకుంటాడేమో అవసరం అయితే ఏభయ్యో అరవయ్యో ఇద్దాం కనుక్కో!" అన్నాను.

"డబ్బయితే యివ్వగలం గాని మనస్సెక్కడ యివ్వగలం!" అన్నది నా భార్య...

నేను మెదలకుండా వూరుకున్నాను.

"పాపం అతని స్థితి కైరూను చెపుతుంటే, వినటమే కష్టంగా వుంటూ వుంది. రాత్రిళ్లు నిద్రలేదట, అన్నం ముట్టటం లేదట..."

"మనం యేం చెయ్యగలం!" అన్నాను నేను.

నాకు నిజంగా ఆ మనిషి రజాకు మనస్సుని యింతగా యెట్లా ఆకర్షించిందా అని ఆశ్చర్యం కలిగింది.

* * *

మరికొన్ని రోజులు గడిచినై. నాకు ఢిల్లీలోనూ, హైదరాబాదులోనూ పని తగిలింది. ముందు ఢిల్లీ వెళ్ళి అక్కడ పని పూర్తి చేసుకుని హైదరాబాదు వెళ్ళాను. నా మిత్రుడు వూళ్లో లేకపోవటంవల్ల, హోటల్లో మకాం పెట్టాను. ప్రొద్దున్న పనిమీద వూళ్ళోకి వెళ్ళి చీకటిపడింతర్వాత హోటలుకి జేరుకున్నాను. స్నానం భోజనాదులు పూర్తి చేసుకుని నాకిచ్చిన గదిలో పడుకున్నాను. మనస్సు రామాయణంమీదకు పోయింది. పెట్టెలోనుంచి తీసిచదవటం మొదలుపెట్టాను. మళ్లీ సుందరాకాండే!... సీతా మహాదేవి హనుమంతుణ్ని రాముని బంటని తెలుసుకోగానే, "ఆయన నన్ను విడిచి ధైర్యంకోల్పోలేదు గదా," అని అడగటం చదివాను. వెంటనే ఆయన తన్నెంత ప్రేమించినా ధర్మరక్షణకోసం తన్ను త్యజించగల

డనే తలపు జ్ఞాపకంవొచ్చి భయంవేసి, "నే నిక్కడ పడే కష్టాలనీ చెప్పి నామీద కరుణ కలిగేట్టు చెయ్యి" అని దీనంగా హనుమంతుణ్ని అడగటం చదివాను. తెప్పిరిల్లి, "ఆయనకు అపకీర్తి కలుగుతుందేమో అనే భయంతో అం న్నాగాని ఆయనకు తెలియం దేముంది!" అని సర్దుకోవటం చదివాను. అక్కడనుంచి సీతను తలచుకొని రాముడు అను భవించిన వేదన చదివాను. పిచ్చివానికిమల్లే తిరిగేవాడు... నేలమీదగాని పడుకునేవాడు కాడు. అన్నం ముట్టుకునేవాడు కాడు. "సీతా" అని పిలపించే ఆ నోటికి మాట లేదు. ఒక్కొక్కప్పుడు బిత్తరిచూపులు చూస్తుండేవాడు. ఒక్కొక్కప్పుడు నిలువుగుడ్లు వేసేవాడు.—

ఆలోచిస్తూ పడుకున్నాను. మనస్సు యింటిమీదకు పోయింది. అకస్మాత్తుగా రజాక్ జ్ఞాపకం వచ్చాడు. అతన్ని విడిచిపెట్టి వెళ్లిన మనిషి వూరు అక్కడకు దగ్గర్లోనే ఉందని జ్ఞాపకం వచ్చింది. వీలుంటే ఆవిడ సంగతి ఆరాతీయ్యా లనిపించింది. నా మిత్రుడు ఊళ్ళోవుంటే బాగుండేది. లేదు యేం చెయ్యాలా అని తీవ్రంగా ఆలోచించాను ఆలోచిం చగా నన్నెరిగిన సబ్ ఇన్స్పెక్టరొకతను యిటీవలే హైద రాబాద్‌కి బదిలీ అయినట్లు జ్ఞాపకం వచ్చింది. అతనిద్వారా యింకేమన్నా విషయాలు తెలుస్తాయ్యేమో కనుక్కోవాలని నిశ్చయించుకున్నాను. రామాయణం అలాగే రొమ్ముల మీద పెట్టుకొని ఆ రాత్రి నిద్రపోయాను.

* * *

తెల్లవారిలేచి, పోలీసు స్టేషన్‌కి ఫోనుచేసి నేను ఎరిగిన సబ్ ఇన్‌స్పెక్టరు యింటి ఎడ్రసు కనుక్కొని అక్కడకి వెళ్లాను. నన్నుచూసేటప్పటికి అతని ప్రాణాలులేచివచ్చినయ్. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్న తరువాత, అతనికి నేను వచ్చిన సంగతి తెలియజేశాను. ఆబిడ పేరూ, ఆవూరు పేరూ చెప్పి ఆ వూళ్లో వుందో లేదో, లేకపోతే ఏమైందో కొంచం కనుక్కోమని చెప్పాను.

"ఆ వూరు చాలా చిన్నవూరు. వున్నపదిమందీ ఒకే మాటమీద వుంటారు. ఆచూకీ తియ్యటం మహా కష్టం. హత్యలు జరుగుతుంటై; సాక్ష్యాలు దొరకవు. నేనిక్కడకు బదిలీఅవకముందు ఆ తాలూకాలోనే పనిచేశాను. అందువల్ల వాళ్లదగ్గరనుంచి విషయాలు తెలుసుకోటానికి కొన్ని కొన్ని మెలకువలు నాకు తెలుసు. నీకు కావలసిన సమాచారం తప్పకుండా సేకరించేపెడతాను." అన్నాడు అతను.

కాసేపయింతర్వాత నేనతని దగ్గర వీడ్కోలుపుచ్చుకొని నాపనిమీద వూళ్లోకి వెళ్లాను. నాలుగయిదు రోజులు పడుతుందనుకున్న పని రెండు రోజుల్లోనే అయిపోయింది. మూడవరోజు హైదరాబాదులో చూడవలసిన దృశ్యాలు ఏమన్నా వుంటే చూద్దామని బయలుదేరాను. ముఖ్యంగా సాలార్ జంగ్ మ్యూజియం చూద్దామనుకున్నాను.

నాకు మామూలుగా "సైట్‌సీయింగ్"అంటేఇష్టంఉండేది కాదు. ఏ దృశ్యం నన్ను తన్మయుపరచేది కాదు. అజా

తాగుహాలను చూచినప్పుడు "ఎంత శ్రమని వృధాచేశారు!! ఈ శ్రమని యే ప్రాజెక్టుకట్టడానికో, యే కాలువలు త్రవ్వటానికో వినియోగిస్తే ఎంత బాగుండేది!!" అనిపించేది. పెద్ద పెద్ద దేవాలయాలనూ, కళా కేంద్రాలనూ చూచినప్పుడు కూడా ఈ విరసభావమే నాలో తలెత్తేది నేనుఅప్పటికి టాజ్ మహల్ చూడలేదు, అయినా టాజ్ మహల్‌ని వర్ణించి తన్మయత్వం చెందుతుంటే బాగుండే కాదు. నేను టాజ్ మహల్‌ని చూడకపోయినా, "టాజ్ మహల్లో అందం లేదు." అనిహక్స్లీ వ్రాసిన వ్యాసం నాకు నచ్చింది ఒకప్పుడు బెర్నార్డ్‌షాని యెవరో "నయాగరా జలపాతాన్ని చూశారా" అనో 'చూట్టానికి వస్తారా?" అనో అడిగారట? దానికి ఆయన "దానికోసం అంతదూరం వచ్చి చూడవలసింది యేముంది? అంతగాచూడదలిస్తే ఏ సినిమాలోనో హాయిగా కుషన్ కుర్చీలోకూర్చొని చూడటం మంచిది." అన్నాడట. ఈ తృణీకారబుద్ధి నాకు ఆ రోజుల్లో బాగా నచ్చేది. కాని యిప్పుడు వేరు.

ఇప్పుడు నాలో తీవ్రమైన మార్పు వచ్చింది. పెద్దలు 'ఆర్ద్రిత' అంటారే, అదేదో నన్నావహించినట్లు ఉంది. దీనికి కారణం వయస్సు మళ్ళటమే కావచ్చు. కారణంయేదయినా ప్రస్తుతం ఏ క్రొత్తవూరు వెళ్ళినా అక్కడ చూడవలసిన విషయాలను ముందే తెలుసుకోటం, తప్పకుండా వాటినిచూచి రావటం జరుగుతూవుంది. ఆ దృశ్యాలు ఇదివరకుమల్లే కాకుండా మనస్సుకి ఆహ్లాదాన్నికూడా కూరుస్తున్నయి. . .

ఊళ్ళోకి బయలుదేరాను. సాలార్‌జంగ్ మ్యూజియం

లో ప్రవేశించగానే మనస్సు స్పందించింది. ఆ ప్రదర్శన వస్తువులను చూస్తూ వాటిచరిత్రను వింటూవుంటే యెన్నో దేశాల సంస్కారాలూ నాగరికతలూ మనస్సును ఉత్తేజపరిచినయ్. ఒక్కొక్క బొమ్మ జీవంపోసుకుని తన కథను, ఆనందాశ్రువులతో కొన్నీ, దుఃఖాశ్రువులతో కొన్నీ, విరహవేదనతో కొన్నీ, వీరావేశంతో కొన్నీ చెప్పుకుపోతుంటే నాకు అనేక దేశచరిత్రలు నాముందు జరిగిపోతునట్లే అనిపించింది. అవన్నీ సజీవ చైతన్య ఆకారాలే అనిపించింది. అక్కడున్నంతసేపూ నాలోనే నెన్నడూ ఊహించని లోతులు కదిలినై ఆవేశాలు ఉబికినై; భావాలు రేగినై. నేను మరోప్రపంచంలో ఉన్నట్టే అనిపించింది ఆ కాసేపూ.

తిరిగి తిరిగి సాయంకాలం హోటలుకు జేరుకున్నాను. నేను జేరేటప్పటికే సబ్ ఇన్‌స్పెక్టరు నా గదిలో కూర్చొని నా కోసం యెదురుచూస్తూన్నాడు. నాకు వెంటనే రజాక్ సంగతి జ్ఞాపకం వచ్చింది.

"తెలుసుకున్నావా?" అని అడిగాను.

"ఓ!" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టరు. అని సంగతంతా చెప్పాడు. ఆ వూరు తనే వెళ్లాడట. మొదట్లో ఎవ్వర్ని కనుక్కున్నా తనకు ఆ వూళ్ళో ఆ పేరుతో ఉన్నమనిషే లేదు. అన్నారట. కాని తనకు పరిచయస్తుణ్ని పట్టుకొని కూపీ తియ్యగా ఆ మనిషి ఆ వూళ్ళోనే ఉన్నట్లు తేలిందట.

ఆబిడ వూళ్లో ఉన్నదనేటప్పటికి నాకు యెక్కడలేని ఆశా పుట్టుకొచ్చింది. రజాక్ కి మంచివార్త చెప్పగలనుగదా అని సంతోషించాను.

"కాని ఆబిడ తన భర్తతో కాపురం చేసుకుంటూ వుంది." అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

నా ఆశ నిరాశ అయింది. నేను మరొక చిక్కు ఏదో రాబోతూ వుందని గ్రహించాను. సబ్ ఇన్‌స్పెక్టరు చెప్పుకు పోతున్నాడు! "ఆబిడకు చిన్నప్పుడే వివాహం అయిందట. అప్పటినుంచీ ఇప్పటిదాకా భర్త వుండనే వున్నాడట. భర్తతోనే ఆబిడ కాపురం చేస్తూ వుందట. కాకపోతే రెండేళ్లకో మూడేళ్లకో వొకసారి, గుబులు మళ్లినప్పుడు కనపడకుండా పోయి తన ఇష్టంవచ్చినట్లు తిరిగి మళ్ళీవస్తూ వుంటుందట. వాళ్ల కులంలో ఇలా తిరగటం తప్పులేదట. పైగా ఇటువంటి వాళ్లని కాపాడే బాధ్యత కులం వాళ్ళమీద వుండటంవల్ల ఎవ్వరు వచ్చి అడిగినా వాళ్ల ఆచూకీ తెలియనివ్వకుండా చేసే బాధ్యత జ్ఞాతిమీద వేసుకుంటారట."

ఈ విధంగా అతను చెప్పుకుపోతుంటే, వొక్కక్షణం నా చెవులను నేనే నమ్మలేకపోయాను. ఒక్కదెబ్బతో నా ఊహాలన్నీ అడుగంటినై. బుద్ధి చలించింది.

"నువ్వు పొరపాటు పడలేదుగదా!" అని అడిగాను.

"లేదు," అన్నాడు నా స్నేహితుడు. అని తానేవిధంగా ఈ సంగతులను ప్రోగుచేసిందీ చెప్పాడు. నిజమే. సందేహం లేదు. అతను చెప్పిన సంగతులన్నీ నిజమే. పొరపాటేమీ లేదు. ఆబిడ మంచితనంమీద అంత నమ్మకం పెట్టుకొని బ్రతుకుతున్న రజాక్‌కి ఈవిషయం ఎలా చెప్పటం? చెప్పటం వల్ల, మనుష్యజాతిమీద అసహ్యం కలగటం, గుండెపగిలి మరణించటం కంటే. చెప్పకపోవటమా అనేవిషయంమీద ఇంటికివెళ్లి నా భార్యతో మాట్లాడివొాక నిర్ణయానికి రావాలని నిశ్చయించుకున్నాను. మరునాడు వేకువజామున బయలుదేరే బండికి ఇంటికి బయలుదేరాను.

ఆ రోజు రైలు ఆలస్యంగా చేరింది. ఊళ్లోఏదో హడావుడి వుండి గుర్రపు బళ్లుకూడా స్టేషన్ దగ్గరలేవు. నేను నెమ్మదిగా నడిచివెళ్లాను ఇంటికి ఇల్లు బావురుమంటూ వుంది. ఒక్కొక్కప్పుడు ఇల్లు యిల్లుగానే వుంటుంది.ఎక్కడి వస్తువులు అక్కడేవుంటాయి. వుండవలసిన మనుష్యులందరూ వుంటారు.కాని ఇంట్లో ఏదో వెలితిఅయినట్లు అనిపించుతుంది. బావురుమంటూ వుంటుంది.మనస్సు అపాయాన్ని శంకిస్తుంది. మా ఇల్లు చూడగానేనాకలా అనిపించింది. గబగబా ఇంట్లోకి వెళ్లాను. నా భార్య విచారంగా కూర్చొని ఉంది. నన్ను చూచి "వొచ్చారా!" అన్నది.

"ఏమిటి సంగతులు?" అన్నాను.

"ఏమీ లేవు" అంది. కాని యేదో వున్నట్లు నాకు స్పష్టం అయింది.

"చెప్పు" అన్నాను.

"పాపం ఆ రజాక్ లేడండీ, ఖైరూన్ తండ్రీ, అతను రాత్రి ఆస్పత్రిలో చనిపోయాడటండీ..." అంది నా భార్య.

నేను నిరుత్తరుడనైనాను. ఒక్క క్షణం అలాగే చూస్తూ నుంచున్నాను. "రాత్రికి రాత్రి ఫెళ్ళున జ్వరం వొచ్చిందట. కొడుకులువచ్చి వెంటనే ఆస్పత్రిలో చేర్పించారట. వేకువజామకి వెళ్ళిపోయాడట!" అంది నా భార్య.

నాకు కళ్లల్లో నీళ్లుతిరిగినై. నా భార్యకు కనపడకుండా మొహం త్రిప్పుకొని, "పోనీ చెడుమాట వినకుండా, నమ్మకం చెడకుండా తన దారిన తాను వెళ్ళిపోయాడు" అన్నాను.

నా భార్యకు యీ నా మాటలు అర్థంకాలేదు. "[illegible] మాటేమిటండీ!" అనడిగింది.

నేను సబ్ యిన్స్పెక్టరు ద్వారా విన్న కథంతా చెప్పాను. నా భార్య అలాగే కళ్లు తెరుచుకొని విన్నది. విని కాసేపటికి తేరుకొని, "ఈ మాట అతని చెవిని పడకుండా చెయ్యటానికే కాబోలు, ఉన్నవాణ్ణి వున్నట్టు ఎత్తుకుపోయాడు భగవంతుడు" అంది.

* * *

నేను స్నానంచేసి భోజనానికి కూర్చున్నాను. ఇంతలో నా భార్య ఏమి ఆలోచించిందో అన్నం వడ్డిస్తూ, "పాపం ఆ కైరూన్ ఎక్కడుందో కొంచం కనుక్కోండి" అంది.

"వాళ్లఅన్నలు తీసుకువెళ్లి వుంటారు."

"వాళ్లుమాత్రం ఏం సాకుతారు! వచ్చి మన ఇంటిలో ఉండమనండి... మన పిల్లలతోపాటు అదీ వుంటుంది" అంది.

నేను అంగీకరించాను.